# పదేళ్ల కల.. నెరవేరుతున్న వేళ

- ఎన్నో నాటకీయ పరిణామాల మధ్య కస్తూర్బా గాంధీ పాఠశాల భవన నిర్మాణం
- నేడు పస్పులలో పాఠశాల ప్రారంభం


పస్పులలో ప్రారంభానికి సిద్ధమైన కస్తుర్బా గాంధీ పాఠశాల భవనం

**మరికల్:** ఎన్నో నాటకీయ పరిణామాల మధ్య పస్పులల్లో నిర్మించిన కస్తుర్బా గాంధీ పాఠశాల నూతన భవనాన్ని ఈ నెల 8న (సోమవారం) ఎంపీ డి.కె అరుణ, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. అంతకు ముందు మరికల్‌కు మంజూరైన కస్తుర్బా గాంధీ పాఠశాల తరగతులు నాలుగేళ్లు మండల కేంద్రంలో, ఆరేళ్లు అద్దె భవనంలో కొనసాగింది. నూతన భవనం కోసం మరికల్ శివారులో ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 449లో అప్పటి ప్రభుత్వం 5 ఎకరాల స్థలం కేటాయించి అప్పటి మంత్రి శ్రీనివాస్‌గౌడ్ చేతుల మీదుగా కేజీబీవీ పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు.

### అడుగడుగునా అడ్డంకులు..

అయితే ఈ భవనం నిర్మాణం జరగకుండా కొంతమంది రాజకీయ నాయకులు అడ్డంకులు సృష్టించారు. ఇంతలోనే గతంలో అక్కడ పట్టాలు పొందిన రైతులు మా పొలాల్లో భవనం నిర్మించరాదని పనులు నిలిపివేసి కోర్టు మెట్లు ఎక్కారు. దీంతో అర్ధాతరంగా పనులు నిలిచిపోయాయి. దీనికి తోడు అద్దె భవనం యాజమాని సైతం పాఠశాలను ఖాళీ చేయించాడు. మరికల్‌లో అద్దె భవనం దొరకపోవడంతో ధన్వాడ కేజీబీవీ భవనంలోకి తరలించారు. మళ్లీ భవనం నిర్మాణం కోసం అధికారులు అప్పంపల్లి శివారులోని గుట్టల ప్రాంతంలో స్థలం పరిశీలించగా అక్కడ బాలికల భద్రత కారణంగా ఆ స్థలాన్ని రద్దు చేశారు. అనంతరం ఎలిగండ్ల, పస్పుల శివారులో పరిశీలించగా చివరకు పస్పులలో ఎట్టాకేలకు భవన పనులు ప్రారంభించారు. మూడేళ్ల పాటు జరిగిన పనులు ఎట్టకేలకు పూర్తి కావడంతో విద్యార్థుల పదేళ్ల కల నేరవేరనుంది. ప్రారంభానికి అధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభించిన వెంటనే ధన్వాడ నుంచి పస్పులకు కస్తుర్బా పాఠశాలను తరలిస్తామని అధికారులు తెలుపుతున్నారు.


### పైపులు వేయిస్తాం..

భవనం ప్రారంభించిన తర్వాత గోడలకు అమర్చిన విద్యుత్ వైరింగ్ స్థానంలో మళ్లీ పైపులు వేసి వైరింగ్ పూర్తి చేయిస్తాం. ప్రస్తుతానికి ఇన్వెటర్, సీసీ కేమెరాలకు గోడలపై నుంచి కనక్షన్లు ఇవ్వడం జరిగింది.

– రాములు, డీఈఈ

### విద్యుత్ వైరింగ్‌పై నిర్లక్ష్యం..

నూతన కస్తూర్బా భవనంలో విద్యుత్ వైరింగ్‌కు పైపులు వేయకుండా స్విచ్ బోర్డుల నుంచి నేరుగా గోడలపై వైర్లను వేసి బల్బులకు, ఇన్వెటర్‌కు కనక్షన్ ఇచ్చారు. కాంట్రాక్టర్ ఇలా విద్యుత్ వైరింగ్ నిర్లక్ష్యంగా చేయడం వల్ల భవిష్యత్‌లో ఏదైన ప్రమాదం జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారన్ని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


గోడలపై పైపులు లేకుండా వేసిన విద్యుత్ వైరింగ్

# లయన్ సేవలు విస్తృతంగా చేపట్టాలి



రఘుబాబు దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

**నారాయణపేట:** నూతనంగా ఏర్పాటైన లయన్స్‌క్లబ్ పేట టౌన్ ఆధ్వర్యంలో సామాజిక సేవ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి సమాజాభివృద్ధికి తోడ్పాటు నందించాలని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ఆదివారం లయన్ క్లబ్ పేట టౌన్ 15వ ప్రమాణ స్వీకారోత్సవంలో అధ్యక్షుడు లయన్ రఘుబాబు దంపతులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించి మాట్లాడారు.. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణంలో విద్య, వైద్య, యువతకు ఉపాధి కల్పన అవకాశాలు తదితర సామాజిక సేవలపై దృష్టి సారించాలన్నారు. లయన్స్‌క్లబ్ చేపట్టే సేవ కార్యక్రమాలకు తనవంతు సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది 20మందికి బెడ్‌షీట్స్, శానిటేషన్ కిట్స్‌ను అందజేశారు. కమిటీ అధ్యక్షుడు లయన్ రఘు బాబు, కార్యదర్శిగా మహేష్ గౌడ్, కో –శాధికారిగా బి. సంజీవరెడ్డి సభ్యులను లయన్ గాజుల మృత్యుంజయ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో లయన్ నటరాజ్, లయన్ కోన వెంకటేష్, రాంరెడ్డి, గందే రవికాంత్, మధుసూదన్ రెడ్డి, శేర్ కృష్ణారెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

# మొదలైన పీర్ల పండగ సందడి

**అమరచింత:** గ్రామాల్లో పీర్ల పండగ సందడి ప్రారంభమైంది. ఆదివారం పట్టణంలోని పెద్దపీర్ల మసీదులో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి, పీర్ల పెట్టెను కిందకు దించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ పీర్ల చావిడి వద్ద ఆలంకు నమస్కరించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం క్యాలెండర్ ప్రకారం మొహర్రం నెల మొదటి రోజు నుంచి పది రోజుల పాటు పీర్ల పండగను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.


పెద్దపీర్ల మసీదులో పీర్ల పెట్టెను కిందకు దించుతున్న ముజావర్లు


ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ

# జోరుగా ఇసుక దందా..


చౌదర్‌పల్లి శివారులో ఫిల్టర్ ఇసుక తయారీ కోసం కుప్పలుగా పోసిన మట్టి


తయారు చేసిన ఫిల్టర్ ఇసుక

- కోయిల్‌సాగర్ వాగు గుల్ల
- వెంకటాయపల్లిలో మట్టి దిబ్బలు మాయం

**దేవరకద్ర:** మండలంలో జోరుగా ఇసుక దందా సాగుతోంది. గుట్టు చప్పుడు కాకుండా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వార ఇసుకను పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. కోయిల్‌సాగర్ వాగును గుల్ల చేస్తు ఇసుక దందాను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ పరంగా చేపట్టే పనుల కోసం అనుమతి తీసుకుని.. అవసరానికి మించి రాత్రివేళల్లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. పెద్దరాజమూర్, చిన్నరాజమూర్, గూరకొండ, పెద్ద గోప్లాపూర్ శివారులోని కోయిల్‌సాగర్ వాగు నుంచి నిత్యం ఈ వ్యవహారం సాగుతోంది. రెవెన్యూ అధికారులు, పోలీసులు ప్రేక్షక పాత్ర వహించడంతో దందాకు అడ్డూ అదుపూ లేకుండా పోతోందని స్థానికులు అంటున్నారు. అదేవిధంగా చిన్నచింతకుంట మండల పరిధిలో ఉన్న వాగు నుంచి కూడా ఇసుక తరలింపు సాగుతోంది. రెండు నెలల క్రితం వాగులో దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలకు చెందిన ఇసుక దందా చేసే వారి మధ్య గొడవలు కూడా జరిగాయి.

### ఫిల్టర్ ఇసుక తయారీ..

వెంకటాయపల్లి శివారుల్లో పెద్ద ఎత్తున మట్టిని తరలించి ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. దీని వల్ల మట్టి దిబ్బలు మాయం అవుతున్నాయి. కొన్ని చోట్ల మట్టిని తీయడం వల్ల గోతులు ఏర్పడుతున్నాయి. దేవరకద్ర మండలం నుంచి మట్టిని తరలించి చౌదర్‌పల్లి సమీపంలోని మహబూబ్‌నగర్ రూరల్ మండలంలో ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నారు. దేవరకద్ర నుంచి మహబూబ్‌నగర్ వెళ్లే దారిలోనే ఫిల్టర్ ఇసుకను తయారు చేస్తున్నా ఎవరికీ పట్టక పోవడం ఆశ్చర్యం కలిస్తోందని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## రెండోరోజు అంగన్‌వాడీల రిలే దీక్షలు



**నారాయణపేట:** రిటర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన రిలే దీక్షలు ఆదివారానికి రెండోరోజుకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్ వద్ద దీక్షలు చేపట్టిన అంగన్‌వాడీలకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి బలరాం పూలదండ వేసి దీక్షలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి వచ్చే వరకు అంగన్‌వాడీల దీక్షలు కొనసాగుతునే ఉంటాయన్నారు. దీక్షలో పద్మమ్మ, దొడ్డ పద్మమ్మ, నర్సింగమ్మ, మౌలానాబీ, తిమ్మమ్మ, సాకలి బాలమ్మ, తిప్పమ్మ, లక్ష్మమ్మ, నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థినులకు వైద్యపరీక్షలు



**ఆత్మకూర్:** మండలంలోని బాలకిష్టాపూర్ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం విద్యార్థినులకు ఆదివారం డాక్టర్ వసంత వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా విద్యార్థినులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని అన్నారు. అనంతరం విద్యార్థినులకు అవసరమైన మందులను పంపిణీ చేశారు. సీహెచ్ఓ సురేష్‌కుమార్, సూపర్‌వైజర్ సురేందర్‌గౌడ్, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ఊట్కూరు:** మండలంలోని పులిమామిడిలో మృతి చెందిన సాబుల అమ్మక్క (70) వృద్ధురాలు ఆదివారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ ఎల్లగౌడ్ మృతురాలి అంత్యక్రియలకు రూ. 5 ఆర్థిక సాయంగా కుటుంబ సభ్యులకు అందించారు.

## పైపులైన్ పనుల పరిశీలన



**మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ:** స్థానిక మూడో వార్డు పరిధిలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రికి ఎదురుగా వెలసిన కాలనీకి మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీటి కోసం గతంలోనే పైపులైన్ వేసినా సరిగా సరఫరా కాకపోవడంతో స్థానికులు ఇటీవల మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ప్రస్తుతం మెయిన్ రోడ్డు నుంచి పెద్ద పైపులైన్‌తో పాటు గేట్ వాల్వ్ ఏర్పాటు చే స్తున్నారు. ఈ పనులను ఆదివారం మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**మహబూబ్‌నగర్ రూరల్:** మన్యంకొండ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల (2007–08లో పదోతరగతి) పూర్వ విద్యార్థులు ఆదివారం.. ఆ బడి ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. పాఠశాల ఉన్నతి కోసం పాటుపడతామని చెప్పారు. కార్యక్రమంలో ఆనాటి గురువులు వెంకటయ్య, రాములు, రేణుకాబాయి, చల్వాచారి, పాఠశాల హెచ్ఎం రవీందర్‌గౌడ్, పూర్వ విద్యార్థులు వెంకట్‌నాయక్, నరేష్‌కుమార్, తులసీరామ్, సాహజబేగం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధ్యానంతోనే సంపూర్ణ ఆరోగ్యం


మాట్లాడుతున్న ఆంజనేయులు

**నారాయణపేట:** నిత్యం ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడంతో వారికి మానసిక ప్రశాంతత లభించి ఆరోగ్యకరంగా తయారవుతారని శ్రీ రామచంద్ర మిషన్ జిల్లా కో–ఆర్డినేటర్ గద్దె ఆంజనేయులు అన్నారు. జిల్లా కేంద్రంలోని శ్రీసాయి ఆలయ ఆవరణలో శ్రీసాయి విజయకాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం ఉచిత ధ్యాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ ధ్యానం చేయడంతో కలిగే ఉపయోగాలు, చేసే విధానం వవరించారు. అన్ని వయస్సుల వారు ప్రతిరోజు గంట పాటు ధ్యానం చేయాలన్నారు. ఆరోగ్యంతోపాటు వివేకం, విజ్ఞానం పెంపొందిచబడుతాయన్నారు. కార్యక్ర మంలో సాయి విజయకాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

# మొహరం శాంతియుతంగా జరుపుకోవాలి


ఊట్కూరులో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్


మక్తల్‌లో మాట్లాడుతున్న ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి

**ఊట్కూరు:** కులమతాల ఐక్యతకు ప్రతీక అయిన మొహర్రం వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గ్రామస్తులతో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మొహరం వేడుకలను ప్రతి ఒక్కరూ ముందుండి శాంతియుతంగా జరిగేవిధంగా తోడ్పడాలని కోరారు. వేడుకల సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసే వసతులు, శాంతి భద్రతలపై గ్రామస్తులు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శంషుద్దీన్, గ్రామస్తులు కృష్ణయ్యగౌడ్, విఘ్నేశ్వర్‌రెడ్డి, మక్తల్ ఇబ్రహీం, కుర్షిద్, మాసీర్‌కాన్, హోటల్‌కాలిక్, గోవిందప్ప పాల్గొన్నారు.

**మక్తల్:** మొహరం వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్ఐ భాగ్యలక్ష్మిరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో గ్రామస్తులతో కలిసి శాంతి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. మొహరం వేడుకలను ప్రతి ఒక్కరూ శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. చావిడిల వద్ద ప్రత్యేకంగా వలంటీర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

**మరికల్:** మొహరం వేడుకలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్ఐ మురళి అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ముస్లింలకు శాంతి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి అవంఛానీయ సంఘటనలకు చోటు ఇవ్వకుండా సామరస్యంగా పండగను చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు పాల్గొన్నారు.

# వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్ లక్ష్యం


నారాయణపేటలో జెండా ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప


మాగనూర్‌లో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

**నారాయణపేట:** మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప జెండా ఆవిష్కరించి మాట్లాడారు.. గత 30 ఏళ్లగా మంద కృష్ణ ఎస్సీలోని 59 ఉపకులాలకు సామాజిక న్యాయానికి, ఎస్సీలను ఏబీసీడీ వర్గీకరణ చేయాలని పోరాడుతున్నాడని గుర్తుచేశారు. సమాజంలో ఉన్న అనేక రుగ్మతలపై పోరాటాలు చేసి, ప్రభుత్వాన్ని ఒప్పించి అనేక సంక్షేమ పథకాలను సాధించాడని చెప్పారు. అనంతరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆనంద్, హన్మంతు, గడ్డం కృష్ణయ్య, చల్ల వెంకటేష్, అశోక్, వెంకటేష్, ఎల్లప్ప, ప్రవీణ్, బాబు, రాము, రాందేవ్, ఆనంద్, అశోక్, హన్మంతు పాల్గొన్నారు.

**మాగనూర్:** మాదిగలు, అణగారిన వర్గాల సమస్యలపై పోరాడే ఏకైక సంఘం ఎమ్మార్పీఎస్ అని ఎమ్మార్పీఎస్ నాయకులు గజపతి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో నాయకులు దినేష్, అనిల్, అశోక్, లక్ష్మణ్, సంజీవ్, విజయ్, తాయప్ప, కొండయ్య, వాభయ్య, నరేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్:** ఎస్సీ వర్గీకరణ సాధనే ఎమ్మార్పీఎస్ లక్ష్యమని రాష్ట్ర కార్యదర్శి అజ్జపాగ లక్ష్మణ్, మండల అధ్యక్షుడు దండు శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు కృష్ణ మాదిగ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, మాసన్న, శ్రీను, బాలమన్యం, పాపారాయుడు, కురుమూర్తి, పరమేష్, రాజు, కురుమన్న, రేవల్లి శ్రీను, సోంబాబు, లక్ష్మీప్రసన్న, ప్రియాంక, రజని, పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపితే చర్యలు


వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

**కొత్తకోట రూరల్:** మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ మంజునాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట సమీపంలో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా వాహనానికి సంబంధించిన అన్ని ధ్రువ పత్రాలతో పాటు లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం తాగి వాహనం నడపరాదని తెలిపారు. రోడ్డు నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డ్రంకన్ డ్రైవ్‌తో పాటు హెల్మెంట్, నంబర్ ప్లేట్ లేని ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## క్లుప్తంగా

### కొత్త రేషన్ కార్డులు అందజేయాలి

**మరికల్:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు కొత్త రేషన్ కార్డులను అందజేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్ అన్నారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజాపాలనలో అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి 7 నెలల గడుస్తున్న నేటికి కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేయలేదన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకునే దశ ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై లేదని విమర్శించారు. కొత్త రేషన్ కార్డుల కోసం అర్హులు నిత్యం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న వారి గోడును ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. వెంటనే దరఖాస్తులు చేసుకున్న ప్రతి ఒక్కరితో పాటు పాత కార్డుల స్థానంలో కొత్త కార్డులు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

### ముళ్ల పొదలతో ప్రమాదం



**మాగనూర్:** మండల పరిధిలోని అడవిసత్యరం – మందిపల్లి గ్రామాల మధ్య చెరువు కట్టపై ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో ప్రమాదాలు సంబవించే అవకాశాలు ఉన్నాయని వాహనాదారులు వాపోతున్నారు. ఈ విషయంపై గతంలో చాలా సార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్పందన లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపుల ముళ్లపొదలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

### రెండు దఫాలుగా బోనాల వేడుకలు

**మరికల్:** మండల కేంద్రంలో రెండు దపాలుగా బోనాల వేడుకలను నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు గ్రామ పెద్దలు నారాయణ, రామస్వామి, జగదీష్, రాజేష్ అన్నారు. ఆదివారం మండలంలోని గజ్జలమ్మ ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన గ్రామస్తుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 9న కుర్వ కులస్తులు, 23న మిగితా గ్రామస్తులు పోచమ్మబోనాల వేడుకలను నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని గ్రామస్తులు గమనించాలని కోరారు.

### బాధిత కుటుంబానికి పరామర్శ

**కొత్తకోట రూరల్:** ఆత్మకూర్‌కు చెందిన రైస్‌మిల్ యజమాని వెంకటేష్‌గౌడ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. కొత్తకోట రైస్‌మిల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం వెంకటేష్‌గౌడ్ కుటుంబ సభ్యులను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అసోసియేషన్ సభ్యులు పరామర్శించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్‌మిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, దార హరినాథ్, శేఖర్‌రెడ్డి, కన్నయ్యశెట్టి పాల్గొన్నారు.

### బ్రోచర్ల ఆవిష్కరణ

**మహబూబ్‌నగర్ క్రీడలు:** హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో వచ్చేనెల 18న జరిగే 34వ నేషనల్ లెవల్ కరాటే కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ బ్రోచర్లను ఆదివారం జిల్లా కేంద్రంలో ఆవిష్కరించారు. కింగ్‌షోటోకాన్ కరాటేడూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ టోర్నీలో ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆర్గనైజర్లు ఎండి.నవీద్ బియబాని, టి.నాగేశ్వర్‌రావు, మాస్టర్లు సయ్యద్ అక్రముల్ల హుస్సేని, ఉమర్ బిన్ తయ్యబ్, జి.కృష్ణయ్య, జహంగీర్‌పాష , కనకం యాదవ్ పాల్గొన్నారు.

### భూమిపూజ

**కోయిల్‌కొండ:** మండల కేంద్రంలోని మైసమ్మ గేట్ వద్ద ఆలయ పునఃనిర్మాణానికి గ్రామస్తులు ఆదివారం భూమిపూజ నిర్వహించారు. గత సంవత్సరం మైసమ్మ దేవాలయాన్ని ఇసుకటిప్పర్ ఢీ కొన్న నేపథ్యంలో నూతనంగా ఆలయం నిర్మించేందుకు దాతల సహకారంతో చర్యలు చేపట్టారు.

### బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించాలి

**మహబూబ్‌నగర్ రూరల్:** రాష్ట్రంలోని ఎరుకల సంక్షేమం కోసం వచ్చే బడ్జెట్‌లో రూ. 500 కోట్లు కేటాయించి, ఏకలవ్య (ఎరుకల) కార్పొరేషన్ చైర్మన్‌ను ప్రకటించాలని నాయకులు అన్నారు. తెలంగాణ ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి విషయంపై విన్నవించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొన్నకల్ కృష్ణయ్య మాట్లాడుతూ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని వివరించామన్నారు. ఈనెల 17న జిల్లా కేంద్రంలో నిర్వహించే ఏకలవ్యుడి జయంతి వేడుకలకు ఎమ్మెల్యేను ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాములు, రవికుమార్ పాల్గొన్నారు.

